
కథ



# నాణానికి రెండో వైపు

వడ్డి ఓంప్రకాష్ నారాయణ్

"శనివారాలనీ, సోమవారాలనీ ఉపవాసం పేరుతో అర్ధాకలితో పడుకుంటే మీ ఆరోగ్యం ఏంకానూ..." అంది మా ఆవిడ చిరుకోపాన్ని ప్రదర్శిస్తూ.

"నా నమ్మకాలు నావి.. నన్నిలా వదిలేద్దూ" అన్నాను.

"అలా కాదండీ... కనీసం టిఫిన్ అయినా చేయండి" అంది ప్రేమగా.

మా ఆవిడకు నేనంటే విపరీతమైన ప్రేమ, అనురాగమూనూ. అయితే స్త్రీకి సహజ సిద్ధంగా వుండే బిడియం కారణంగా బైట పడదేమోనని నాకు అప్పుడప్పుడూ అనుమానం వస్తుంటుంది. ఉదాహరణకు ఇవాళ సంగతే తీసుకోండి... అందరి భార్యలు ఇంత శ్రద్ధగా తమ భర్తల ఆకలి సంగతి, ఆరోగ్యం సంగతి పట్టించుకుంటారా... లేదు కదా! మా ఆవిడకు నేనంటే వున్న ప్రత్యేకమైన అభిమానం కొద్ది ఇలా మందలిస్తుంటుంది. పడుకోబోయే ముందు నా ఇష్ట దైవం ఏడుకొండల వాడికి నమస్కరించి పడుకున్నాను. ఇవాళ ఒంటిపూటే భోజనం చేశానేమో... వెంటనే నిద్ర పట్టేసింది.

***

అసలైన దేవుడు అడగకుండానే భక్తులకు వరాలిస్తాడట. అదేం చిత్రమో హఠాత్తుగా మెలుకువ వచ్చి చూస్తే, సాక్షాత్తు వెంకటేశ్వర స్వామే చిద్విలాసంగా నవ్వుతూ నా కళ్ళ ముందు నిలబడి వున్నాడు. నిజం చెప్పొద్దూ... ఎంత దేవుడైనా అంత హఠాత్తుగా బెడ్‌రూమ్‌లో ప్రత్యక్షమైపోతే ఖంగారుగానే వుంటుంది కదా. కాస్త తత్తరపడి "ఏమిటి స్వామి నేను తలుచుకోకుండానే ఇలా ప్రత్యక్షమయ్యారు" అని అడిగేశాను కొద్దిగా ధైర్యాన్ని కూడగట్టుకుని.

"సుబ్రహ్మణ్యం! నీకు నేను చాలా రుణపడి వున్నానయ్యా. నువ్వు ఉద్యోగం సంపాదించు కున్నప్పట్నించి ప్రతి శనివారం ఉపవాసం ఉంటూనే వస్తున్నావ్. ఎప్పుడైనా ఏదైనా కోరిక కోరుకుంటే తీర్చేసి, నీ రుణం తీర్చుకుందామను కుంటుంటే... దుంపతెగ... నువ్వసలు నన్ను ఒక్క కోరికా కోరవేమయ్యా!" అన్నాడాయన నా నిజాయితీని నిలువుటద్దంలో చూపెడుతూ.

"ఏదో చిన్నప్పట్నించి కలియుగ దైవం అనే ఫీలింగ్‌తో మీరంటే నాకు కాస్త ఇది. అంతే కానీ కోరికలు కోరేటందుకటండీ నేను ఉపవాసం వుంటోంది. పోద్దురూ.. నాకే కోరికలూ లేవు" అని ఖరాఖండిగా చెప్పేశాను స్వామి వారితో.

నన్ను అంత తేలిగ్గా వదిలితే ఆయన కలియుగ దైవం ఎట్లా అవుతాడు.

"ఠట్... వీల్లేదు... నువ్వు కోరిక కోరుకోవాల్సిందే... నేనీ రాత్రి నీకు ఓ వరం ఇవ్వాల్సిందే" అన్నాడాయన టేబుల్ మీద వున్న ఒనిడా టీ.వీ.ని పక్కకు జరిపి ఆ ఖాళీ స్థలంలో సెటిలైపోతూ.

"నేను ప్రేమించిన అమ్మాయితో పెళ్ళి జరిపించావ్. మంచి ఉద్యోగం ఇప్పించావ్. పండంటి కొడుకునిచ్చావ్. ఇంకా నాకేం కావాలి స్వామి... నన్నొదిలెయ్" అన్నాను.

"ఇవన్నీ నేనిచ్చినవి కాదయ్యా. మీ మనుష్యులతో ఇదే తంటా. వెధవ పనులు చేసి దేవుడా నువ్వే కాపాడంటారు. మీరు కష్టపడి పైకొచ్చి అంతా దేవుడి దయ అంటారు. మీ మీద మీకే నమ్మకం వుండదు. నాన్నా సుబ్బూ... నువ్వు ఏదో ఒకటి కోరుకుంటే గానీ నేనీవాళ నిన్ను వదిలేది లేదు" అన్నాడాయన కాస్త సీరియస్‌గా.

'దేవుడికి కోపం వస్తే కష్టం కదాని' నేనే ఓ మెట్టు దిగాను చివరకి.

నిజానికి నా మనస్సులో ఎప్పట్నించో ఓ కోరిక వుంది. 'మా ఆవిడ నన్ను అమితంగా ప్రేమిస్తూ కూడా... ఆ విషయాన్ని బైట పెట్టడం లేదేమోనని'. మా ఆవిడ నా గురించి తన మనస్సులో ఏం అనుకుంటుందో నాకు తెలిస్తే ఎంత బావుండ్ను అని నేను రోజు మొత్తంలో ఒకసారన్నా అనుకోవడం కద్దు.

ఎంతైనా దేవుడు కదా... నా మనస్సులో కోరికను ఇట్టే కనిపెట్టేశాడాయన. "ఓ.కే. సుబ్బూ... నీ కోరిక డన్. మీ ఆవిడ నీ గురించి మనసులో ఏం అనుకుంటుందో ఈ క్షణం నుంచి నీకు తెల్సిపోతుంది. మీ ఆవిడ మాట విన్నైనా ఇక నుండి శనివారాలు ఒంటి పూట ఉపవాసాలు మాని నన్ను రుణ విముక్తుడ్ని చెయ్" అన్నాడాయన ఎన్టీఆర్ లెవెల్లో ఎడమ చేతితో ఆశీర్వదించి అంతర్ధానం అవుతూ.

కొంపదీసి ఈ తతంగం అంతా మా ఆవిడో... మా చిన్నాడో గమనించలేదు కదా అని తలతిప్పి చూశాను. దేవుడి దయ వల్ల వాళ్ళిద్దరూ గాఢ నిద్రలో వున్నారు. హమ్మయ్య అని ఓ నిట్టూర్పు విడిచి నిద్రలోకి జారిపోయాను.

***

పొద్దున్నే పాలవాడి కేకతో మెలుకవ వచ్చింది. 'పాలండోయ్' అన్న ఆ పొలికేక నా చెవులకి చేరగానే అలవాటుగా "మధూ! పాలవాడొచ్చాడు. కాస్త పాలు పోయించుకో" అని ఆర్డరేసి ఇటు తిరిగి పడుకొన్నాను.

'అబ్బ.. మంచి నిద్రలో లేపుతారు. ఏం ప్రతిరోజూ నేనే లేచి పాలు పోయించుకోవాలా? ఓ పూట మీరు పోయించుకుంటే కరిగిపోతారేం?' అన్న మాటలు వినిపించాయి. ఎప్పుడూ వినని ఆ వాయిస్‌కి కాస్త ఖంగారు పడి మా ఆవిడ మాధవి వైపు చూశాను. మెళ్లో మంగళ సూత్రాన్ని కళ్ళకద్దుకుంటోంది భక్తిగా. పెదాలు కదలడం లేదు. మరి మాటలెక్కడి నుండి వచ్చాయ్! అప్పుడు గుర్తొచ్చింది. రాత్రి స్వామివారు సెలవిచ్చారు కదా... మా ఆవిడ మనసులోని విషయాలు ఇవాళ నుండి నాకు తెలుస్తాయని. బహుశా ఆ మనసు వాయిస్ అయి వుంటుంది.

మాధవి రోజూ పొద్దున్నే పాలు పోయించుకునేటప్పుడు నన్నిలా తిట్టుకుంటుందన్న మాట అనుకున్నాను.

కళ్ళకి మంగళ సూత్రాలు అద్దుకునే చర్యకి, మనసు మాటకి ఎంత వ్యత్యాసం వుందీ అనిపించింది. ఇంతలో చిన్నగా ఓ కునుకు తీశాను. రోజూలానే ఆరుగంటలయ్యే సరికి పేపర్‌బోయ్ డైలీపేపర్ విసిరేసి పోయాడు. లేచి వీధి తలుపు దగ్గరకు వెళ్ళి పేపర్ తెచ్చుకోవాలంటే బద్ధకంగా అనిపించింది. చిన్నాగాడు ఇంకా నిద్ర లేవలేదు. మాధవి వంటింట్లో కాఫీ కాస్తున్నట్టుంది.

"మధూ.. పేపర్ అందుకో" అని పిలిచాను.

'పేపర్ రాగానే చదవడానికి తయారు... చదివేప్పుడు లేని బద్ధకం లేచి నాలుగడుగులు వేసి పేపర్ తెచ్చుకోవడానికి వస్తుంది ఈయన గారికి. పొద్దున్నే ఆర్డర్లేయడానికేం వెనుకాడరు. మగ మహారాజులు కదా...' అన్న వాయిస్ వినిపించింది.

ఏమిటీ మధూ మనస్సే ఇలా ఫీలవుతోంది! అని ఆశ్చర్యపోయాను.

ఇంతలో బెడ్ రూమ్‌లోకి ఓ చేతిలో కాఫీకప్పుతో, మరో చేతిలో పేపర్‌తో మాధవి ప్రత్యక్షమయ్యింది. అప్పుడే తలస్నానం చేసిందేమో... ముంగురుల నుండి నీళ్ళు బొట్టుబొట్టుగా పడుతున్నాయి. తలకు చుట్టుకున్న తడి తువ్వాలు జాకెట్ వెనకభాగాన్ని తడిపేసింది. నుదుట సిందూరం బంగారంలా మెరిసి పోతోంది. ఇవాళ మాధవి పూర్తిగా కొత్తగా కనిపిస్తోంది.

"గుడ్‌మార్నింగ్... బెడ్ కాఫీ రెడీ" అంది నవ్వుతూ. ఓ చేతిలో పేపర్‌ని, మరో చేతిలో కాఫీ కప్పునీ పెట్టి.

మాధవి మనసులోని భావాలకి ఈ శుభోదయాభినందనలకీ ఎంత తేడా!

మాధవిని హృదయానికి హత్తుకుందామంటే చేతిలో వేడి వేడి కాఫీ కప్పు

పెట్టి నా శరీరంలోని వేడిని చప్పున చల్లార్చేసింది.

"ఇవాళ దేవిగారు ముగ్ధ మనోహరంగా కనిపిస్తున్నారే" అన్నాను.

"అటువంటిదేం లేదు" అంది చిరునవ్వుతో కనురెప్పల్ని భారంగా మూసి తెరుస్తూ.

'ఆ... ఈ కబుర్లకేం తక్కువ లేదు... హూఁ' అంది మాధవి మనసు.

ఓరి దేవుడో.. ఏమిటీవాళ అంతా యాంటీ క్లయిమాక్స్‌గా వుంది అనుకున్నాను.

నా మీదుగా వంగి చిన్నాగాడిని లేపి భుజాన వేసుకెళ్ళింది. ఆవిడగారి చర్యలను కళ్ళప్పగించి చూసి ఆస్వాదించడం తప్ప నేనేం చేయగలిగే స్థితిలో లేను.

మా ఆవిడ చిన్నాగాడి తయారిలోనూ, నేను పేపర్ చదవడంలోనూ పడిపోయాం. చిన్నా స్నానం పూర్తి కాగానే మాధవి డ్రస్సింగ్ రూమ్‌లోకి వచ్చింది. నేను నీళ్ళగదిలోకి వెళ్ళాను. వేడి నీళ్ళు తయారుగా వుండటంతో మొఖం కడుక్కొని గబగబా స్నానం కానిచ్చేశాను. అప్పుడు గుర్తొచ్చింది. కొత్తగా గుర్తొచ్చేదేవుంది... రోజూ జరిగే ప్రహసనమే...

"మధూ... కాస్త టవల్ అందుకో' అని కేకవేశాను.

'అబ్బ! ఎంత ప్రేమగా పిలిచారండీ. మీకు కాఫీ, పేపర్, టవల్ ఇవ్వడానికేగా మేంవుంది' అంది మాధవి మనసు.

బాప్ రే! ఏవిటీ రివల్యూషన్.... తడిగా వున్న నా ఒళ్ళంతా దెబ్బకే ఆరిపోయింది.

"త్వరగా తల తుడుచుకోండి... ఆనక మళ్ళీ జలుబు చేస్తుంది. వెంటనే వస్తే వేడి వేడి ఇడ్లీలు రెడీగా వున్నాయి" అంది టవల్‌ను నా భుజం మీద వేసి వయ్యారంగా వెనుదిరుగుతూ.

నా మొహంలో కదలాడుతున్న భావాల్ని తను గమనించకుండా టవల్‌ని అడ్డం పెట్టుకుని నీళ్ళగది నుండి బైటపడ్డాను.

రోజూలానే తలకి నూనె రాయమని మాధవిని అడుగుదామనుకున్నాను కానీ నాకే ఎందుకో కాస్త భయం అనిపించింది. ఆ మనస్సు ఏ భావాలను బైట పెడుతుందోనని నేనే నూనె రాసుకుని, తల దువ్వుకుని, ఉతికిన లుంగీ కట్టుకుని వాలు కుర్చీలో ఆదివారం అనుబంధం చదువుతూ కూర్చున్నాను.

ఇంతలో మాధవి ప్లేట్‌లో ఇడ్లీలు పెట్టుకుని వచ్చింది. ఎన్నైనా చెప్పండి... మా ఆవిడ చేసే అన్ని వంటలూ ఓ ఎత్తు. ఈ ఇడ్లీ ఒకెత్తూ. ఆప్యాయానురాగాల్ని, ప్రేమను కలగలిపి నా కోసమే ప్రత్యేకంగా వండుతుందా అనిపిస్తుంటుంది వీటిని తింటుంటే... ఇడ్లీలంటే నాకు చిన్నప్పట్నించి చచ్చేటంత ఇష్టం. ఈ విషయంలో తను నాకు ఏ మాత్రం అన్యాయం చేయలేదు. నా టేస్టుకు తగ్గట్టుగా ఆ స్థాయిలోనే ఇడ్లీలు చేస్తుంటుంది.

ఇడ్లీల గురించీ ఆలోచిస్తూ... ఓ అరడజను లాగించేశాను.

"ఏవిటో... ఆదివారం పొద్దున్నే కాస్త కారప్పొడీ, నెయ్యి వేసుకుని నువ్వు చేసిన ఇడ్లీలు తింటుంటే... జన్మధన్యం అయిపోయినట్టుగా వుంటుంది మధూ... నా కోసమే ప్రత్యేకంగా నువ్వీ ఇడ్లీలు చేయడం...."

నా మాటలు పూర్తి కాలేదు. 'బాగానే ఉంది సంబరం. చిన్నాగాడు ఇడ్లీలైతే కాస్త శ్రద్ధగా ఓ ముక్క ఎక్కువ తింటాడని వండుతున్నాను. అయినా మిక్సీ పాడైందని చెప్పి పదిరోజులైంది. రుబ్బింగ్ మిషన్ మన ఇంటి దగ్గర్లో లేదు. పాత్రంతో మినపప్పు, పచ్చడీ రుబ్బేసరికీ భుజాలు పడిపోయాయి. 'ఇద్దెన్లు బాగున్నాయి మధూ' అని కల్లబొల్లి కబుర్లు చెబుతారే కానీ ఈ వారంలో ఏ నాడైనా ఆ మిక్సీని బాగు చేయించుకుని వస్తానని అన్నారా? చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా అని అన్నారందుకే' అంది మాధవి మనసు.

> **ఇంతలో బెడ్ రూమ్‌లోకి ఓ చేతిలో కాఫీకప్పుతో, మరో చేతిలో పేపర్‌తో మాధవి ప్రత్యక్షమయ్యింది. అప్పుడే తలస్నానం చేసిందేమో... ముంగురుల నుండి నీళ్ళు బొట్టుబొట్టుగా పడుతున్నాయి. తలకు చుట్టుకున్న తడి తువ్వాలు జాకెట్ వెనకభాగాన్ని తడిపేసింది.**

పీకల దాకా ముచ్చట పడి తిన్నానేమో ఒక్కసారిగా వాంతి వచ్చినంత పనైంది. గ్లాసులో నీళ్ళు గటగటా తాగేసి స్థిమిత పడ్డాను.

ఫిల్టర్ కాఫీ కూడా మాధవి ఇవాళా బాగా చేసింది. కానీ కాఫీ మీద కామెంట్ చేయ దలచుకోలేదు. కాఫీ కప్పు పక్కన పెట్టి సిగరెట్ అందుకున్నాను. రజనీకాంత్ స్టయిల్లో సిగరెట్ ఎగరేసి నోట్లో పెట్టుకోవడం నాకు కాలేజీ రోజుల్నుండీ అలవాటు. అలవోకగా అలా ఎగరేసి పెదాలతో క్యాచ్ చేస్తుంటే స్నేహితులు పడి చచ్చిపోయేవాళ్ళు. ఎంతో మంది అమ్మాయిలు కూడా నావంక ఆరాధనగా చూసేవారు. పాపం వాళ్ళు మనలా సిగరెట్లు తాగలేరు కదా... అందుకని నాకు వాళ్ళ పట్ల ఆ విషయంలో ఓ సాఫ్ట్ కార్నర్ వుంది. సిగరెట్ వెలిగించానో లేదో ఓ చిన్న గాలి తెమ్మెర అలా వీచింది. ఓ ఆనందానుభూతికి నేను లోనయ్యేలోగానే మా చిన్నాగాడు కాస్త దగ్గాడు.

"ఏరా ఏవైంది" అన్నాను కాస్త చిరాగ్గా.

ఇంతలో వంట గదిలోంచి బాణంలా దూసుకొచ్చింది మా ఆవిడ. గబగబా పిల్లాడ్ని ఎత్తుకుని భుజాన వేసుకుని కారిడార్‌లోకి వెళుతూ "ఎందుకండీ ఇంట్లో పిల్లాడి పక్కన సిగరెట్ తాగుతారు" అంది సున్నితంగా.

'సిగరెట్ తాగే మగాడంటే ఆడవాళ్ళకి అభిమానంతో పాటు కొద్దిగా ఈర్ష్య కూడా ఉంటుందను కుంటాను' అని నాలో నేను విశ్లేషించుకునేంతలో... మా ఆవిడ మనసు గొంతు నన్ను చేరింది.

'వెధవ ఫోజూ ఈయనానూ... సిగరెట్ తాగి తన ఆరోగ్యం పాడు చేసుకోవడమే కాకుండా ఇంట్లో ఆ దరిద్రపు సంతనెలిగించి పిల్లాడి ఆరోగ్యాన్ని కూడా పాడు చేస్తున్నారు. మనిషన్నాక కాస్త ఇంగితం కూడా లేకపోతే ఎలా. ఖర్మ ఖర్మ... పైగా ఆ సిగరెట్‌కు నేను బానిసను కాదు... అది నా హాబీ అంటూ చచ్చు రెడీమేడ్ ఆన్సర్ ఒకటి. నా ఖర్మ కొద్దీ కనిపెట్టారు లాగుంది ఈ దిక్కుమాలిన సిగరెట్‌ను' అని మా ఆవిడ ఆలోచనా తరంగం నన్ను చుట్టుముట్టింది.

సిగరెట్ పొగ కూడా ఈ సారెందుకో ఘాటుగా అనిపించి, దగ్గు తెరలు తెరలుగా వచ్చింది.

ఇక ఒక్కక్షణం కూడా మా ఆవిడ ఎదురుగా వుండాలనిపించలేదు. కాస్త రోడ్డున పడితేనైనా ప్రాణానికి సుఖంగా ఉంటుందని పించింది. బట్టలు వేసుకుని బైటికి పోయేందుకు తయారౌతూ... "మధూ! కొద్దిగా బూట్లు తుడిచిస్తావా!" అన్నాను ఏదో ఆలోచనలో.

"ఏవిటీ ఇవాళ అప్పుడే బజారుకు బైలుదేరారు" అంది మాధవి చంటాడ్ని వేరే చంకలోకి మార్చుకుని, పాత గుడ్డతో నా బూట్లను తుడుస్తూ.

'ఇక రోడ్డు మీదకి బైలుదేరారన్నమాట.. ఇంట్లో ఓ పెళ్ళాం వుంది. కాస్త పనిలో సాయం చేద్దాం... ఓ చంటోడు వున్నాడు. వాడి ఆలనా పాలనా కాస్త పట్టించుకుందాం... ఒక్క దానికి ఇంట్లో ఏమైనా బోర్ కొడుతుందేమో! కాసేపు కంపెనీ ఇద్దాం అని ఏమైనా వుందా? కట్టుకున్న భార్యకి కనీసం గౌరవం కూడా ఇవ్వరు. ఏం ఈయన గారు ఉద్యోగం చేస్తే, నేను ఇంట్లో చాకిరంతా చేయడం లేదా... అయినా ఈయన గారి బూట్లు తుడవాల్సిన ఖర్మ నాకేంటీ? అదే నా జాకెట్లు, లంగాలు ఉతకమంటే ఉతుకుతారా? అస్సలు భార్యంటే ఈయన గారి ఉద్దేశంలో ఏంటీ? పెళ్ళిలో తాళి కట్టగానే ఆయన గారి పాదధూళిని తలను దాల్చి, వేసే ఆర్డర్లన్నింటినీ తూచా తప్పకుండా పాటించడమే అనుకుంటున్నారా... అయినా ఈయన్ని అనుకుని ఏం లాభం... ఈ మగజాతి అంతా అలాగే ఉండేట్టుగా వుంది' మాధవి మనసులో భావాలను వినేసరికి నాకు దిమ్మతిరిగి పోయింది.

బూట్లు వేసుకోకుండానే దేవుడి పూజా మందిరంలోకి అడుగు పెట్టాను. నా ఇష్ట దైవం నన్నింత ఘోరమైన శిక్షకు గురిచేస్తాడని ఊహించనైనా లేదు.

"తప్పైపోయింది స్వామి... నన్ను క్షమించి నీ వరం వాపస్ తీసేసుకో... నా భార్యలోనే కాదు పెళ్ళయిన ఆడపిల్లలో భర్త పట్ల ఇంతటి అసంతృప్తి ఉంటుందని ఊహించనైనా లేదు. వాళ్ళని ఇంత అసంతృప్తికి తెలిసో, తెలియకో గురిచేస్తున్న నన్ను, నా మగజాతిని దయచేసి క్షమించు" అని బేర్ మంటూ లెంపలు వాయించుకున్నాను. లెంపలు వాయించుకుంటూనే వున్నాను....

***

"ఏవండీ... ఏవిటీ... అలా చెంపలు వాయించుకుంటున్నారు" విస్మయంగా నా వంక చూస్తూ అంది మా ఆవిడ. కల నుండి ఇలలోకి వచ్చి పడ్డాను.


"అబ్బే... ఏదో పీడకల" అన్నాను గొంతు సవరించుకుంటూ.

పక్కనే జగ్గులో ఉన్న నీళ్ళని గ్లాస్‌లో పోసి నా నోటికి అందించింది. నీళ్ళు తాగి కాస్త సర్దుకున్నాను. నా నుదుటి మీద చెమట బిందువుల్ని తన పైట అంచుతో తుడుస్తూ దగ్గరగా తీసుకుంది. ఆమె సాంగత్యంలో పీడకలని మరచిపోతుంటే...

బైట పాలవాడి కేక వినిపించింది. మాధవి లేచి వెళ్ళబోయింది.

"నువ్వు కాసేపు పడుకో. ఇవాళ నేవెళ్ళి పాలు పోయించుకుంటాను" అన్నాను మంచం దిగి లుంగీ సర్దుకుని పాత్ర కోసం వంటింటి వైపు వెళ్తూ. ●

## పెద్దగా పట్టించుకోను



ధర్మేంద్ర రెండో కుమారుడు బాబీడియోల్ మాటల్లో సినిమాతాత్వికత ఎక్కువగా కనిపిస్తుంటుంది. సినిమాల జయాపజయాలు మాత్రమే జీవితం కాదనే బాబీ కుటుంబజీవితాన్ని అమితంగా ప్రేమిస్తానంటాడు. ఓ బిడ్డకు తండ్రికావాలని కోరుకుంటున్న బాబీ తనను కన్నతండ్రి ధర్మేంద్ర తనను చూసి గర్వంగా ఫీల్ అవ్వాలంటాడు. అందుకోసం తను ఎంతయినా కష్టపడగలను అంటాడు. తండ్రికి పుత్రోత్సాహం... జనులా పుత్రుని కనుగొని పొగిడినప్పుడే కదా! బాబీ సినిమాలు పెద్దగా హిట్‌కాకున్నా, తనను మాత్రం జనం బాగానే గుర్తిస్తున్నారు, టాలెంట్ విషయంలో పాజిటివ్‌గానే మాట్లాడుతున్నారని బాబీ ఉవాచ. ఆ మేరకు ధర్మేంద్ర ఓకే. బాబీ డియోల్ కిప్పుడు ఓ హిట్ సినిమా బాగా అవసరం. "పోటీ అనేది సినిమా ప్రపంచంలోనే లేదు. అన్నిరంగాల్లోనూ ఉంది. నేను మరింత కష్టపడి నన్ను నేను ప్రూవ్ చేసుకుంటాను. నేనే కాదు పోటీ ప్రపంచంలో ఎవరైనా చేయాల్సింది అంతే కదా!" అంటూ హిందీరంగంలో ఖాన్‌ల ప్రభంజనాన్ని, హృతిక్ సంచలనాన్ని పెద్దగా పట్టించుకునే రకం కాదు నేను అని చెప్పకనే చెబుతుంటాడు బాబీడియోల్. ●